సాక్షి
వికారాబాద్
గురువారం । 28 । నవంబర్ । 2024



కార్మికులకు భద్రత కరువు

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత లేకుండా పోయిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 8లో▸



శుభ్రత పాటించాలి

విద్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది శుభ్రత పాటించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి వాజుద్దీన్ సూచించారు. 9లో▸



సమస్యలు పరిష్కరిస్తా

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీఎస్ యూటీఎఫ్ ముందంజలో ఉంటుందని జిల్లా ప్రధానకార్యదర్శి రాములు అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: అపోలో ఫార్మసీలో దాదాపు 50 పోస్టుల భర్తీకి ఈ నెల 29న వికారాబాద్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సుభాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జాబ్‌మేళా ఉంటుందని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర



సాల్వీడు గ్రామంలో ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

కుల్కచర్ల: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర ఆదేశించారు. బుధవారం మండలంలోని సాల్వీడు గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో వరి కోతలు పూర్తైన నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. ధాన్యం సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఏపీఎం శోభ, సీసీ వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

న్యాయసేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి డీజీ శీతల్



మాట్లాడుతున్న న్యాయమూర్తి డీజీ శీతల్

అనంతగిరి: బాల్య వివాహాలు చేయడం నేరమని న్యాయసేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయమూర్తి డీజీ శీతల్ అన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు చేసినా.. ఇందుకు సహకరించినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. 18 ఏళ్లలోపు అమ్మాయిలకు వివాహం చేస్తే అనేక సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అబ్బాయిలతో పాటు అమ్మాయిలకు కూడా సమాన అవకాశాలు కల్పించాలన్నారు. ఇద్దరిని సమాన దృష్టితో చూడాలన్నారు. అమ్మాయిలు ఉన్నత చదువుతోనే అనుకున్న లక్ష్యాలను చేరుకోగలరని పేర్కొన్నారు. అందుకు కష్టపడి చదువుకోవాలని సూచించారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ ఎయిడ్ న్యాయవాదులు రాము, వెంకటేష్, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకు మౌలిక వసతులు కల్పించండి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి



మొయినాబాద్: భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి అన్నారు. మొయినాబాద్‌లోని లేబర్ అడ్డాలో బుధవారం భవన నిర్మాణ కార్మికుల సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద ప్రభుత్వం తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్స్, రూ.5కే భోజనం వంటి సదుపాయాలను కల్పించాలన్నారు. కార్మికులంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల ఇన్‌చార్జి సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు శివయ్య, శంకర్, దర్శన్, రాజు, మల్లేష్, కేశవులు, నర్సింలు, యాదమ్మ, జ్యోతి, కళ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్‌లోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి వచ్చిన పత్తి

కొర్రీ.. రైతు వర్రీ

తేమశాతం సాకుతో పత్తి ధరల తగ్గింపు

- రైతులను ఇబ్బంది పెడుతున్న కొనుగోలు కేంద్రం నిర్వాహకులు
- కాటన్ మిల్లర్లతో సీసీఐ అధికారుల కుమ్మక్కు
- క్వింటాలుకు ప్రభుత్వ మద్దతు ధర రూ.7,521
- బహిరంగ మార్కెట్‌లో రూ.6,500
- అయినా దళారులకే విక్రయించి నష్టపోతున్న రైతన్న

వికారాబాద్: దళారులు, వ్యాపారుల బారి నుంచి రైతులను రక్షించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాయి. పంటలకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నాయి. అయితే కొన్ని తప్పిదాల కారణంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని కొర్రీలు పెట్టి ధర తగ్గిస్తుండటంతో రైతులు పంట దిగుబడిని దళారులకు విక్రయిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), కాటన్ మిల్లు యజమానులు కుమ్మక్కై రైతుకు నష్టం కలిగిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందనే సాకుతో క్వింటాలుకు రూ. 500 నుంచి రూ.1000 వరకు ధర తగ్గించి ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

నత్తనడకన కొనుగోళ్లు

సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్ల లక్ష్యం బారెడు, సేకరణ మూరెడు అన్న చందంగా తయారైంది. జిల్లాలో సీసీఐ ఆధ్వర్యంలో 14 పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో తాండూరు, వికారాబాద్, పరిగి ప్రాంతాల్లో మూడు చొప్పున, మర్పల్లి, కోట్‌పల్లి, ధారూరు, కొడంగల్‌లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేశారు. వ్యవసాయ మార్కెట్ అధికారులు, సీసీఐ అధికారుల పర్యవేక్షణలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో 2.30లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుచేయగా ఎకరాకు 8నుంచి 10 క్వింటాళ్ల చొప్పున 2.2లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశారు. సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి నెల రోజులు దాటినా ఇప్పటి వరకు కేవలం 12,736 మంది రైతుల నుంచి 30,479 క్వింటాళ్లు మాత్రమే సేకరించారు. ఇందుకు సంబంధించి రూ.229 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 3,430 మంది రైతులకు రూ.59 కోట్లు జమ చేశారు.

కొర్రీలతో దూరం..

కేంద్ర ప్రభుత్వం ఈ ఏడు క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధర ప్రకటించింది. ప్రైవేటు వ్యాపారులు, జిన్నింగ్ మిల్లుల్లో, బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ.6,500 వరకు చెల్లిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కొర్రీల కారణంగా రూ.500 నుంచి రూ.1000 వరకు నష్టం వచ్చినా రైతులు దళారులకే విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో పత్తి విక్రయిస్తే వెంటనే డబ్బులు ఇస్తుండటంతో అటువైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. ధరలో హెచ్చుతగ్గులు కూడా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో కొర్రీల కారణంగా అక్కడికి వెళ్లేందుకు రైతులు ఆసక్తి చూపడంలేదు. తేమ 8శాతం కంటే ఎక్కువగా ఉంటే ధరలో కోత విధిస్తున్నారు. 12శాతం కంటే ఎక్కువగా ఉంటే కొనుగోలు చేయడంలేదు. తేమ 8 శాతానికి మించితే ఒక్కో శాతానికి రూ. వంద చొప్పున తగ్గించి ఇస్తున్నారు. అంతే కాకుండా పొట్టిపింజ రకం, పొడువు పింజ రకం అనే తేడాలతో ధరలు తగ్గించడం, వాతావరణ పరిస్థితులతో కొద్దిగా రంగుమారిగా పత్తిని తీసుకోకుండా తిప్పి పంపడం తదితర కారణాల వల్ల కొనుగోలు కేంద్రాల పట్ల రైతులు ఆసక్తి చూపడంలేదు. కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయిస్తే డబ్బులు ఆలస్యంగా జమ అవుతుండటం కూడా కారణంగా చెబుతున్నారు. మరో వైపు ఆన్‌లైన్‌లో పత్తి విస్తీర్ణం నమోదు చేయకపోవడం కూడా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆన్‌లైన్‌లో లేకపోవడంతో ఏఈఓల చుట్టూ తిరిగాల్సి వస్తోందని రైతులు అంటున్నారు.

సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి

కలెక్టర్ ప్రతీక్ జైన్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బొంరాస్‌పేట: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియను పరిశీలించారు. వివరాల నమోదులో ఎలాంటి తప్పులు ఉండరాదని సిబ్బందికి సూచించారు. అనంతరం బొంరాస్‌పేట, మెట్లకుంట, బురాన్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, తుంకిమెట్లలో సన్నరకం వరి ధాన్యం కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం సేకరణ, నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. వసతులపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. సన్నరకం వడ్లకు సంబంధించిన బోనస్ డబ్బు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.

పాఠశాల సందర్శన

మండలంలోని తుంకిమెట్ల ప్రాథమిక పాఠశాలను బుధవారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి రోజు భోజనం ఇలాగే ఉండాలని సిబ్బందికి సూచించారు.

వైద్య శిబిరాలు నిర్వహించండి

అనంతగిరి: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకులాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణతో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై పాఠశాలల సిబ్బందికి, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. దగ్గు, జలుబు, జ్వరం మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ వెంకటరవణ, ఉప వైద్యాధికారి జీవరాజు తదితరులు పాల్గొన్నారు.



డయల్ 100 కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి



ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: డయల్ 100కు వచ్చే కాల్స్‌పై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వరాదని ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమావేశమయ్యారు. పీఎస్‌ల వారీగా పెండింగ్ కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారు డయల్ 100కు కాల్స్ చేస్తారని తక్షణం స్పందించి సాయం అందించేందుకు కృషి చేయాలని సూచించారు. అప్పుడే పోలీసు శాఖపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. కేసులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సీసీ టీవీలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలీసు వాహనాలను ఎప్పటికప్పుడు సర్వీసింగ్ చేయించి మంచి కండీషన్‌లో పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై విస్తృత ప్రచారం అవసరం

- సుప్రీం కోర్టు తీర్పును ప్రతిఒక్కరూ చదవాలి
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్

వికారాబాద్: ఈవీఎంల పారదర్శకతపై అనుమానం వ్యక్తం చేస్తూ వేసిన ప్రజావ్యాజ్యంపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును విస్తృత స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. చీఫ్ ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు తాను ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించే విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదని దేశ అత్యున్నత న్యాయస్థానం తన తీర్పు ద్వారా వెల్లడించిందని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలను వినియోగించడంపై ప్రజలు ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని తెలిపారు. తాజాగా కోర్టు ఇచ్చిన తీర్పుపై విస్తృత స్థాయి ప్రచారం అవసరమని పేర్కొన్నారు. ఈ తీర్పును అందరు చదవాలి.. చర్చించాలి.. చదువుకున్న వ్యక్తులు ఈ విషయంపై తోటివారికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలపై దేశ పౌరులకు నమ్మకం ఉన్నప్పుడే వ్యవస్థ మరింత పటిష్టమవుతుందన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పారదర్శక ఎన్నికలే ఈసీ ఉద్దేశం

సుప్రీం కోర్టు తీర్పుతో ఈవీఎంలపై ఉన్న అనుమానాలన్నీ నివృత్తి అయ్యాయని అన్నారు. 130 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో 70 కోట్లకు పైగా ఓటర్లు ఉన్నారని.. ఇందులో 50 కోట్లకు పైగా ఓటు హక్కును వినియోగించుకుంటారని తెలిపారు. ఇంత మంది ఓటర్లు ఉన్న దేశంలో బ్యాలెట్ ద్వారా ఓట్ల లెక్కింపు ఎంతో కష్టమని.. ఒక్కోసారి ఎక్కువ మొత్తంలో బీయూలు(బ్యాలెట్ యూనిట్లు) వాడాల్సి వస్తుందని.. ఓట్ల లెక్కింపునకు రోజుల తరబడి సమయం పడుతుందని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా జరగాలన్నదే ఈసీ ఉద్దేశమని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఈవీఎంల విషయంలో ఎలాంటి అనుమానాలు అవసరం లేదు.. రెండు సార్లు ర్యాండమైజేషన్ ఉంటుంది.. ఆ తర్వాత ఏ ఈవీఎం ఏ పోలింగ్ స్టేషన్‌కు వెళుతుందో ఎవరికి తెలియదు.. ఓటింగ్‌కు కొద్ది ముందే రాజకీయ పార్టీల ఏజెంట్లు, పోటీ చేసే వ్యక్తుల సమక్షంలో మాక్ పోలింగ్ కూడా ఉంటుంది.. ఇదంత జరిగాక కూడా ఎవరైనా అనుమానాలు వ్యక్తం చేస్తే ఈవీఎంలు మార్చే వెసులు బాటు కూడా ఈసీ కల్పించిందని తెలిపారు.

విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఇందుకోసం ప్రణాళికా బద్ధంగా వెళ్తున్నట్లు చెప్పారు. ప్రతి అధికారి వారంలో రెండు ప్రభుత్వ పాఠశాలలు సందర్శించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. మౌలిక సదుపాయాలు కల్పించి ఎప్పటికప్పుడు పరిశీలిస్తారని తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పారిశుద్ధ్యం వంటివాటిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు. గతంలో గురుకులాల్లో మాత్రమే వాటర్ టెస్టింగ్ కిట్లు ఉండేవని త్వరలో అన్ని పాఠశాలలకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో మూవీ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటి వరకు 176 స్కూళ్లకు స్క్రీన్‌లు, కంప్యూటర్లు అందజేశామన్నారు. త్వరలో వీటిని ప్రారంభిస్తామన్నారు. ప్రేరణాత్మక సినిమాలు విద్యార్థులకు చూపించే ఉద్దేశంతో ఈ మూవీ క్లబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పత్తి, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని తెలిపారు.

నరేందర్‌రెడ్డి రిమాండ్ పొడిగింపు

- డిసెంబర్ 11వరకు పొడిగిస్తున్నట్లు కొడంగల్ కోర్టు వెల్లడి
- బెయిల్ పిటిషన్‌పై తీర్పును నేటికి వాయిదా వేసిన జిల్లా కోర్టు

వికారాబాద్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి రిమాండ్‌ను న్యాయస్థానం మరో 14 రోజులు పొడిగించింది. లగచర్ల ఘటనలో ఏ-1 నిందితుడిగా ఉన్న ఆయనను ఈనెల 13న అదుపులోకి తీసుకున్న పోలీసులు 14న కొడంగల్ కోర్టులో హాజరుపర్చగా 14రోజులపాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నరేందర్‌రెడ్డి రిమాండ్ గడువు బుధవారం ముగిసింది. దీంతో న్యాయస్థానం మరోసారి ఈ కేసును విచారించింది. వాదనలు విన్న అనంతరం నరేందర్‌రెడ్డి రిమాండ్‌ను డిసెంబర్ 11వరకు పొడిగిస్తున్నట్లు న్యాయస్థానం వెల్లడించింది. ఇదిలా ఉండగా కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆయనను స్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా బుధవారం కోర్టులో వాదనలు జరగగా.. వచ్చే నెల 2వ తేదీకి వాయిదా పడింది. నరేందర్‌రెడ్డి బెయిల్ కోసం వికారాబాద్ జిల్లా కోర్టులో వేసిన పిటిషన్‌పై వాదనలు జరగగా తీర్పును గురువారానికి వాయిదా వేశారు. మరోవైపు లగచర్ల దాడి ఘటనలో 71 మందిని నిందితులుగా గుర్తించిన పోలీసులు ఇప్పటి వరకు 29మందిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఇందులో కొందరు చర్లపల్లి జైలులో, మరి కొందరు సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్నారు.





క్లుప్తంగా

బాలిక అదృశ్యంపై గాలింపు ముమ్మరం



తాండూరు బస్టాండ్‌లో ఆచూకీ కోసం పోలీసుల యత్నాలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్ కోట్ గ్రామానికి చెందిన బాలిక స్వాతి అదృశ్యం కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ నెల 22న తాండూరు బస్టాండ్‌లో బాలికను సీసీ కెమెరాలు ద్వారా పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. బస్టాండ్ నుంచి వేరే బస్సు ఎక్కి ఎక్కడికైనా వెళ్లిందా అనే కోణంలో పరిశీలిస్తున్నారు. బుధవారం కరన్ కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తన బృందంతో బస్టాండ్ పరిసరాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు.

కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

శంకర్‌పల్లి: పోలీస్ స్టేషన్‌కి వచ్చే కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ శంకర్‌పల్లి పోలీసులకు సూచించారు. బుధవారం స్థానిక ఠాణాని ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులు, రిసెప్షన్, స్టేషన్‌లోని వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. స్టేషన్‌లో రికార్డులను పక్కాగా మెయింటెన్ చేయాలని, బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే సత్వరమే స్పందిచాలన్నారు. అదే విధంగా కేసుల దర్యాప్తులో వివరాలను లోతుగా సేకరించాలన్నారు. విధి నిర్వహణలో పోలీసులు నిర్లక్ష్యం వహించొద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నార్సింగి ఏసీపీ రమణగౌడ్, శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గంజాయి పట్టివేత

అనంతగిరి: గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన బుధవారం వికారాబాద్‌లో చోటు చేసుకుంది. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఎండీ.ఫయాజ్ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నాడనే పక్కా సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. ఈ సమయంలో రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో ఎండీ ఫయాజ్ అనుమానాస్పదంగా తిరగడాన్ని గమనించారు. వెంటనే అతన్ని పట్టుకుని విచారించగా 120 గ్రాములు ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వెంటనే అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీం ఇన్‌చార్జి శ్రీనివాస్, ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, హనుమంతు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీ.. వ్యక్తి దుర్మరణం

షాద్‌నగర్‌రూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని చటాన్‌పల్లి రైల్వేగేట్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెల్జర్ల తండాకు చెందిన రవి(43) బైపాస్ రహదారిలోని యమ్మీ హోటల్‌లో పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి చటాన్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. రవి తన స్కూటీపై రైల్వేగేట్ వైపు వస్తుండగా కేటీఆర్ చికెన్ సెంటర్ ముందు గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై ఎదురుగా వచ్చి స్కూటీని ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

జారిపడి వృద్ధుడి మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: బాత్రూంలో జారి పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని రాగన్నగూడలో కాల్వ రామిరెడ్డి(71) నివసిస్తుండేవాడు. ఈ నెల 23న ఆయన అర్ధరాత్రి బాత్రూంలో జారి పడ్డాడు. వైద్యం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా బుధవారం అక్కడే మృతి చెందారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

- మధ్యాహ్న భోజనంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- మెనూ పాటించాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం



పరిగి: బాలసదనంలో పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్



దోమ: ఊటుపల్లిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

పరిగి: బాలసదనంలోని చిన్నారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని బాలసదనాన్ని ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. అనాథ చిన్నారులకు మంచి ఆహారం అందిస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. బాలసదనంలో ఉండే చిన్నారులకు అన్నీ మనమే చూసుకోవాలన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కరీం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వంటగది పరిశీలన

దోమ: ప్రతి విద్యార్థికి నాణ్యమైన భోజనం అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ఊటుపల్లి పాఠశాలను ఆర్డీఓ వాసుచంద్రతో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. వంటగది, మధ్యాహ్న భోజనం, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వంట గదిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

బాలికల వసతి గృహంలో..

తాండూరు రూరల్: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పృథ్వీ, జిల్లా ఆస్పత్రి వైద్యురాలు స్వాతి హెచ్చరించారు. బుధవారం జినుగుర్తి సమీపంలో ఉన్న గిరిజన గురుకుల బాలికల వసతి గృహాన్ని సందర్శించారు. హాస్టల్లో విద్యార్థినుల గదులతో పాటు వంట గదులను పరిశీలించారు. వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనం

కొడంగల్ రూరల్: మధ్యాహ్న భోజన పరిశీలనలో భాగంగా బుధవారం అధికారులు విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ విజయకుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎంఈఓ రాంరెడ్డి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మండల పరిధిలోని ఎరన్‌పల్లి(అప్పాయిపల్లి) గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దారు ఆకస్మికంగా తనిఖీ చేస్తూ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమికోన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజన సరుకులను, బియ్యం తదితరవాటిని పరిశీలించారు.

చౌడాపూర్‌లో..

కుల్కచర్ల: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని చౌడాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ వెంకటేశ్ చారి, ఎంఈఓ రాంచందర్ పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల పరిధిలోని వీరాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం భుజించారు.

మెనూ పాటిస్తున్నారా?

దుద్యాల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కొడంగల్ మండల ప్రత్యేకాధికారి(జిల్లా అటవీశాఖ) జ్ఞానేశ్వర్, హస్నాబాద్ గ్రామ ప్రత్యేకాధికారి(ఎంపీడీఓ) ఉషశ్రీ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని హస్నాబాద్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందుతున్నాయా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఎంఈఓ విజయరామారావు భోజనం చేశారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని ఆయన సూచించారు.



కుల్కచర్ల: వీరాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు



దుద్యాల్: అన్నం, సాంబార్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారులు



కొడంగల్ రూరల్: జెడ్పీహెచ్ఎస్(బాలికల) విద్యార్థులతో భోజనం చేస్తున్న అధికారులు

కొండముచ్చుల నుంచి కాపాడండి

ఫారెస్టు అధికారులకు రుద్రారం గ్రామస్తుల వినతి

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో కొంత కాలంగా కొండ ముచ్చులు ఇబ్బందులకు గురి చేస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. ఈ మేరకు సీపీఐ నాయకులతో కలిసి బుధవారం ఫారెస్టు అధికారులకు వినతిపత్రం అందించారు. కొండ ముచ్చులు మనుషులు, పశువులపై దాడి చేస్తున్నాయని, వెళ్లగొట్టేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇటీవల ఇద్దరిని గాయపరిచాయని తెలిపారు. వాటి నుంచి కాపాడాలని విన్నవించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మహిమూద్, నాయకులు బషీర్, శ్యామ్‌సుందర్, గ్రామస్తులు శ్రీనివాస్, శ్రవణ్ కుమార్, బిచ్చప్ప, రమేశ్, ఎల్లప్ప, జగన్, పాషా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు గౌరవ వేతనాలు

బొంరాస్‌పేట: పాఠశాలల్లో మూడు నెలల క్రితం నియమించిన అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు బుధవారం గౌరవ వేతనాల చెల్లింపులు జరిగాయి. దీంతో నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, కొడంగల్, దౌల్తాబాద్, దుద్యాల మండలాల అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు బుధవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రాష్ట్రంలో ఎక్కడలేని విధంగా కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈఓ రేణుకాదేవి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి ఆయా మండలాల ఎంఈఓలు రాంరెడ్డి, హరిలాల్ ప్రత్యేక కృషి వల్ల సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను మూడు నెలల క్రితం నియమించారని, 101 రోజుల గౌరవ వేతనాన్ని విడుదల చేయడంతో సీఎంకు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా మండలాల అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు బొంరాస్‌పేట ఉప్పరి అనిల్, కుమార్, దౌల్తాబాద్ అక్రం, నర్సింలు, కొడంగల్ రమాకాంత్, దుద్యాల ఆంజనేయులు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మోదీ పాలనలో దేశం పటిష్టం

జీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న కుమార్‌యాదవ్

చేవెళ్ల: నరేంద్రమోదీ పాలనలో దేశం ఎంతో పటిష్టంగా మారిందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేవైఎం చేవెళ్ల కన్వీనర్ దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్ హాజరై మాట్లాడారు. సభ్యత్వ నమోదును పెద్ద ఎత్తున నిర్వహించి ఇచ్చిన లక్ష్యాల కంటే ఎక్కువ మొత్తంలో చేయించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ పటిష్టత కోసం పని చేయాల్సిన బాధ్యత బీజేవైఎం కార్యకర్తలపై ఉందన్నారు. యువతకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన మోసాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. హైడ్రా పేరుతో హైడ్రామా చేశారని, ఇప్పుడు మూసీ ప్రక్షాళన పేరుతో మరింత కాలయాపన చేస్తున్నారన్నారు. అమలు చేసే సత్తా లేనప్పుడు హామీలు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. అందుకే ప్రజలు కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిలోనే పూర్తిగా విఫలమైందని తెలుసుకున్నారన్నారు. డిసెంబర్ 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కాంగ్రెస్ పార్టీ పాలన తీరును ఎండగడుతూ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పార్టీ ట్రైనింగ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ సుదీంద్రాశర్మ, అసెంబ్లీ కన్వీనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు విఘ్నేశ్, అనంత్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, శ్రీకాంత్, మహేశ్ పాల్గొన్నారు.

పల్లె ప్రగతితో గ్రామాలాభివృద్ధి

సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి



సిక్కిం ప్రతినిధులతో సమావేశంలో పాల్గొన్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు(కడ్తాల్ మాజీ సర్పంచ్) గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాజేంద్రనగర్ జాతీయ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సిక్కింకు చెందిన స్థానిక సంస్థల ప్రతినిధుల(సర్పంచ్)తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారెడ్డి.. గత గ్రామ పంచాయతీ పాలకవర్గంలో పల్లె ప్రగతి ద్వారా చేపట్టిన పనుల గురించి వివరించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్వహణ, పల్లె ప్రకృతి వనం, తడి పొడి చెత్త వేరుచేసే విధానం, రైతు వేదికలు, వైకుంఠధామాల నిర్మాణం, పంచాయతీలలో సొంత ఆదాయ వనరుల పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందడం పట్ల సిక్కిం ప్రజాప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రొఫెసర్లు అంజన్‌కుమార్ బాంజియా, రవిబాబు, సిక్కిం గ్రామ పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి



రవి (ఫైల్)

తాండూరు రూరల్: అనారోగ్యంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జినుగుర్తి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నానాపురం రవి(35) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గ్రామంలో సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవాడు. వారం రోజుల క్రితం ఆయనని పచ్చకామెర్లు రావడంతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఒక్కసారిగా ఆరోగ్యం క్షీణించి రవి మృతి చెందాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

కల్లు విక్రయించే గుడిసె దగ్ధం

మొయినాబాద్: రోడ్డు పక్కన కల్లు విక్రయించడానికి నిర్మించిన గుడిసె దగ్ధమైంది. ఈ సంఘటన మండల పరిధిలోని పెద్దమంగళారంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీత కార్మికులు కల్లు విక్రయించడానికి పెద్దమంగళారం-చందానగర్ రోడ్డు పక్కన గుడిసె ఏర్పాటు చేశారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుడిసె తగులబడుతుండగా పెట్రోలింగ్ పోలీసులు గమనించి మంటలు ఆర్పారు. బుధవారం ఉదయం గీత కార్మికులు వెళ్లే సరికి గుడిసె కాలిపోయి ఉంది. గ్రామానికి చెందిన శివయ్యగౌడ్, సందీప్‌గౌడ్‌లపై గీత కార్మికుల సంఘం సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువు

సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్



కార్మికులతో మాట్లాడుతున్న మహిపాల్ తదితరులు

పరిగి: రోజు రోజుకు పరిశ్రమల్లో కార్మికులకు భద్రత కరువవుతుందని, ఈ విషయంలో పట్టించుకునే అధికారులు లేరని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని మాదారం గ్రామంలోని పవన్ ఫైవుడ్ కంపెనీలో ఉరి వేసుకుని ఇటీవల ఓ కార్మికుడు మృతి చెందిన విషయం తెలుసుకొని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆయన బుధవారం పరిశ్రమను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడారు. వారికి కనీస అవసరాలను సైతం పరిశ్రమ యాజమాన్యం కల్పించడం లేదన్నారు. 25 సంవత్సరాల నుంచి ఇక్కడ పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించకపోవడం బాధాకరమన్నారు. ఇక్కడ పనిచేస్తున్న వారి నివాసాలు అతి దారుణంగా ఉన్నాయన్నారు. పరిశుభ్రత లేకపోవడంతో కార్మికులు నిత్యం అవస్థలు పడుతున్నారన్నారు. కార్మికుల నివాసాలు చిన్నవిగా ఉండడంతో ఇంట్లో పందికొక్కులు తవ్వడంతో అస్తవ్యస్తంగా ఉందన్నారు. ఇక్కడ కార్మికులు 12 గంటల నుంచి 36 గంటల వరకు పరిశ్రమల్లో పనిచేస్తున్నారన్నారు. కంపెనీలో లేబర్ యాక్ట్‌లను అమలు చేయడం లేదని, కనీస భద్రత లేకపోవడంతో నిత్యం అవస్థలు పడుతున్నారన్నారు. మాస్కులు, హెల్మెంట్‌లు, కాటన్ దుస్తులు కల్పించడం లేదన్నారు. నిత్యం ఎదో ఒక పరిశ్రమలో కార్మికులు ఏదో ఓ కారణంతో మృతి చెందుతున్న అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా పరిశ్రమల్లో సంబంధిత యాజమాన్యం స్పందించి పరిశ్రమల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని కోరారు.

బాల్య వివాహాలు నేరం

పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప



మాట్లాడుతున్న జడ్జి నాగుల శిల్ప

పరిగి: బాల్య వివాహాలు చేయడం నేరమని, అందుకు కారణమైన బాధ్యులపై చట్టం శిక్షిస్తుందని పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి నాగుల శిల్ప పేర్కొన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తుంకుల్‌గడ్డలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ బాలికల జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ ముక్త్ భారత్' నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడారు. బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమన్నారు. ఎక్కడ బాల్య వివాహాలు నిర్వహించినా ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి పోలీసులకు సమాచారం చేర వేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ అందుబాటులో లేని సమయంలో చైల్డ్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేసి సమాచారం ఇస్తే సరిపోతుందన్నారు. ప్రతీ విద్యార్థి చదువుపైనే శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యసాధన కోసం కష్టపడి ఇష్టంతో చదువుకోవాలన్నారు. జీవితంలో ఉన్నత స్థానంలో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది నరేంద్రయాదవ్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ గౌస్‌పాషా, ప్రిన్సిపాల్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కేరాఫ్ అడ్రస్ లేదు!



సిటీలోని బహిరంగ ప్రదేశాల్లో పలువురి నివాసం

- మద్యం, గంజాయి, వైట్‌నర్ మత్తులో జోగుతూ నేరాలు
- తరచూ ఘర్షణలతో స్థానికులకు ఇబ్బందులు
- గతంలో డేటాబేస్ రూపొందించిన పోలీసులు
- ప్రస్తుతం పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: ఏ అడ్రస్ లేనివాళ్లకు నగరంలోని కొన్ని ప్రాంతాలు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. సిటీలోని బహిరంగ ప్రదేశాల్లో ఆశ్రయం పొందుతున్న వీరు స్వచ్ఛంద సంస్థలు, ప్రార్థన స్థలాలు, జీహెచ్ఎంసీపై ఆధారపడి బతికేస్తున్నారు. అనునిత్యం నిషాలో జోగుతూ, ఘర్షణలకు దిగుతూ స్థానికంగా ఇబ్బందులు సృష్టిస్తున్నారు. ఇలాంటి వారిలో కొందరు కొన్ని నేరాలు చేస్తున్నప్పటికీ తీవ్రమైతే తప్ప రికార్డుల్లోకి ఎక్కట్లేదు. గతంలో నగర పోలీసు విభాగం ఈ అభాగ్యుల డేటాబేస్ నిర్వహించింది. ప్రస్తుతం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవకపోవడంతో వీరికి అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లోనే..

ఈ అపరిచితుల సమస్య ప్రధానంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రవాణా సౌకర్యం ఉన్న ప్రాంతాల్లోనే ఎక్కువగా ఉంటోంది. సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్, రైల్వేస్టేషన్, పాస్‌పోర్టు కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు నాంపల్లి, జేబీఎస్, సీబీఎస్ తదితర చోట్ల వీరు కనిపిస్తుంటారు. వీరిలో కొందరు మతిస్థిమితం సరిగా లేక ఇలా వస్తుండగా... మరికొందరు కుటుంబీకులతో సరిపడక, ఇబ్బందుల నేపథ్యంలో వచ్చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లు, పార్కులతో పాటు బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో జీవిస్తున్నారు. అనివార్య కారణాల నేపథ్యంలో ఇలాంటి అభాగ్యుల్లో అనేక మంది గంజాయి, వైట్‌నర్, మద్యంతో పాటు వివిధ రకాలైన మత్తు టాబ్లెట్లకు బానిసలుగా మారుతున్నారు. ఆ మత్తులో ఘర్షణలకు దిగడంతో పాటు స్థానికంగా అనేక సమస్యలు సృష్టిస్తున్నారు.

గతంలో డేటాబేస్ క్రియేట్ చేసిన పోలీసులు...

ఈ అభాగ్యులు, అనాథలు నేరాలకు పాల్పడుతుండటంతో నాంపల్లి పోలీసులు గతంలో డేటాబేస్ ఏర్పాటు చేశారు. రైల్వే స్టేషన్‌తో పాటు పబ్లిక్‌గార్డెన్‌లో వీరి బెడద ఎక్కువగా ఉంటుంది. దీంతో మధ్య మండల అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం ద్వారా వీరి డేటాబేస్ రూపొందించారు. అందులో పేరు, ఫొటో, చిరునామాతో పాటు వేలిముద్రల్నీ సంగ్రహించి స్టోర్ చేశారు. దీనివల్ల భవిష్యత్తులో జరగరానిది జరిగితే ఈ డేటా ఉపయుక్తంగా మారుతుందని ఈ చర్యలు తీసుకున్నారు. అయితే కాలక్రమంలో పోలీసులు వీరి మాట పూర్తిగా మర్చిపోయారు. అయితే షెల్టర్ హోమ్స్‌కు లేదా స్వస్థలాలకు పంపాలని, లేదంటే కనీసం వీరిపై కన్నేసి ఉంచడంతో పాటు డేటాబేస్ రూపొందించాలని పలువురు కోరుతున్నారు. అలాకాకుంటే భవిష్యత్తులో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని స్పష్టం చేస్తున్నారు.

పొట్ట నింపుతున్న స్వచ్ఛంద సంస్థలు..

ఇలా బహిరంగ ప్రదేశాల్లో జీవిస్తున్న వారిలో కొందరు చిన్న చిన్న పనులు చేసుకుని పొట్ట పోసుకుంటున్నారు. వీరికి జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న రూ.5 క్యాంటీన్లు ఆకలి తీరుస్తున్నాయి. అత్యధికులు మాత్రం కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రార్థన స్థలాలు, నగర వాసులు అందిస్తున్న ఆహారం తిని బతికేస్తున్నారు. ఇలాంటి వారిలో కొందరు స్థానికంగా ఉన్న దుకాణాలు, వాహనచోదకులు, పాదచారుల నుంచి చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నారు. ఏదైనా పెద్ద ఉదంతం చోటు చేసుకున్నప్పుడు మాత్రమే రికార్డుల్లోకి ఎక్కుతున్నారు. అయితే ఈ నేరాలపై ఫిర్యాదు చేయడానికి ఎవరూ ఆసక్తి చూపకపోవడం వీరికి కలిసి వస్తోంది. నగరంలో విదేశీ వీవీఐపీల పర్యటనలు ఉన్నప్పుడు మాత్రమే యంత్రాంగాలకు వీరితో పాటు బిచ్చగాళ్లు గుర్తుకు వస్తుంటారు. ఆ సమయంలో హడావుడిగా షెల్టర్ హోమ్స్‌కు తరలించే అధికారులు ఆపై వీరి విషయం మర్చిపోతుంటారు.

అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి..

యువకుడి దుర్మరణం

మొయినాబాద్: బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై మొయినాబాద్ మండల పరిధిలోని రాణే ఇంజన్‌వాల్వ్ కంపెనీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండలం బొబ్బిలిగామ గ్రామానికి చెందిన బంటు శివ(21) నగరంలో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన శివ స్నేహితుడు రిషివర్ధన్ బండ్లగూడలో ఇంటర్ చదువుతున్నాడు. కాగా మంగళవారం సాయంత్రం రిషివర్ధన్, శివకు ఫోన్ చేసి నేను కూడా ఇంటికి వస్తాను అప్పా జంక్షన్ వద్దకు రమ్మని చెప్పాడు. పని ముగించుకుని రాత్రి 10 గంటలకు శివ అప్పా జంక్షన్ వద్దకు బైక్‌పై వచ్చాడు. ఇద్దరు కలిసి అక్కడి నుంచి ఇంటికి వెళ్లేందుకు బయలుదేరారు. హైదరాబాద్-బీజాపూర్ జాయతీ రహదారిపై రాణే ఇంజన్ వాల్వ్ కంపెనీ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. రిషివర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.